సమకాలీన జీవితంలో ప్రతి చిన్న సమస్యా రక్తాన్ని పులుముకుంటోంది. మరి పెద్ద సమస్యలమాటో? గతంలోనూ, ఆగతంలోనూ 'రకతం' యిచ్చే పరిష్కారమేమయినా వుందా?

# రకతం

జయంతి



ఒక అబ్బాయి ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి మరో అబ్బాయిని ప్రేమించింది.

అతడు ఆ అమ్మాయి తన్ను యెందుకు ప్రేమించలేదో కారణాలు వెదికి, వెదికి, తుదకు ఆ డబ్బున్న అమ్మాయి, ఆ డబ్బున్న అబ్బాయినేకాని తన్ను ప్రేమించలేకపోయిందని తెలుసుకున్నాడు. అతడికి ఆ ప్రేమింపబడిన అబ్బాయిమీద పట్టరానికోపం వచ్చింది.

అప్పుడతను తన విఫల ప్రేమను తన తోటి సోదర విద్యార్థులకు చెప్పుకున్నాడు. ఓరోజు సాయంకాలం, ఆ భగ్న ప్రేమకుడు సోదర విద్యార్థులతో కలిసి చెట్టు చాటున నిలబడి కారులో పోతున్న ఆ ప్రేమింపబడిన అబ్బాయి మీద బుల్లిబుల్లి రాళ్లు విసిరారు. ఆ అబ్బాయి వెంటనే రివ్వున తప్పించుకుపోయి పోలీసుల్ని పంపించాడు. పోలీసులకూ - విద్యార్థులకు చిన్న దెబ్బలాట జరిగింది.

ఆ విధంగా ఆవేళ అక్కడ కొంత హింస జరిగింది. కొంత రక్తం పారింది.

* * *

ఓ రోజు ఓ విద్యార్థి సినీమా చూడ్డానికి వెళ్ళాడు. ఆ బొమ్మలో ప్రేమ ఆకాశాన్నంటినప్పుడు ఆ అబ్బాయికి వొళ్ళు పులకరించింది. ఆ పులకరింపులో కాళ్ళు సాచి వొళ్ళు విరుచుకుంటున్నప్పుడు. అతనికాలు ఓ సుందరాంగి కాలివేళ్ళకూ, అతని చెయ్యి ఆసుందరాంగి చీరకొంగుకు తగిలాయి. ఆమె భుజంమీద చెయ్యివేసి కూర్చున్న ఆమె భర్తకు వుక్రోషం వచ్చింది. అంచాత అతడు తన పనివాళ్ళను వెంటనే పిలిపించి వాళ్ళచేత వెనువెంటనే ఆ అబ్బాయిని తన్నించాడు. అతడు తనకు జరిగిన అవమానాన్ని తోటి విద్యార్థులకు చెప్పుకున్నాడు. వెంటనే విద్యార్థులు వచ్చి ఆ సుందరాంగి భర్త ఇంటికీ, వాళ్ళ కార్లకీ పెట్రోలుపోసి తగలబెట్టారు. పోలీసులు వచ్చారు. కొందరు విద్యార్థులు పట్టుబడ్డారు. కొందరు దెబ్బలుతిని పారిపోయారు. కొందరు దెబ్బలు తినకుండా పారిపోయారు. కొందరు రాళ్ళు విసిరి పారిపోయారు. కొందరు పారిపోకుండా రాళ్ళు విసిరారు.

ఆ విధంగా ఆవేళ అక్కడ హింస జరిగింది. కొంత రక్తం పారింది.

* * *

ఓసారి ఓ ప్రాంతంవారు, తమ ప్రాంతం వెనకబడివుందనీ, తమకు అన్యాయం జరుగుతూందనీ, తమ ప్రాంతంలో ఒక పరిశ్రమ పెట్టమనీ ప్రభుత్వాన్ని కోరారు. ఆ పరిశ్రమ అక్కడ పెట్టకపోతే ఎంతమంది తమ పార్టీ నాయకులకు నష్టమో, పెట్టేస్తే ఎంతమందికి నష్టమో, వారివారి నష్టాలు తమకు ఎటువంటి కష్టాలు కలిగిస్తాయో, ఆ ప్రభుత్వం లెక్కలు వేసివేసి, ఎంత వేసినా అవి సరిగ్గా కిట్టకపోడంవల్ల, ఆ ప్రజల కోర్కెను పక్కకు పెట్టింది. ఆ ప్రజలు చాలా కాలం ఆగి ఆగి, మరింక ఆగలేక, శాంతియుత సత్యాగ్రహాలు ప్రారంభించారు. కొందరు నిరాహార దీక్షలు పూనేరు. కొందరు పనులు మానేశారు. ఆఫీసులు మూయశారు. కాలేజీలకు తాళాలు పడ్డాయి. బస్సులూ - రైళ్ళూ ఆగాయి. శాంతిని నెలకొల్పడానికి సాయుధ దళాలు వచ్చాయి. కొందరు జైళ్ళలో తోయబడ్డారు. కొందరు లాఠీలతో కొట్టబడ్డారు, కొందరు తుపాకులతో కాల్చబడ్డారు.

ఆ విధంగా అప్పుడు శాంతియుత సత్యాగ్రహ సందర్భంలో హింస జరిగింది, రక్తం పారింది.

* * *

ఓసారి ఓ ప్రాంతంవారు తమకు అన్యాయం జరుగుతూందనీ, తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలనీ ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చేస్తే తమ బలం తగ్గిపోతుందో. ఇవ్వకపోతే తగ్గిపోతుందో. ఆ ప్రభుత్వం ఆలోచించి. ఆలోచించి, బలా బలాలు త్రాసులో వేసి తూచి, తూచి అంతుచిక్కక అయోమయంలో పడిపోయింది. అప్పుడు ఆ ప్రాంతం ప్రజలు బంద్‌లు జరిపారు. నిరాహార దీక్షలు చేశారు. పన్నులు చెల్లించమన్నారు. ప్రభుత్వ ఆజ్ఞలను నిరసించారు. ప్రజా జీవితం స్తంభించిపోయింది. శాంతిని నెలకొల్పడానికి సియార్పీ, మిలటరీ దళాలు విజృంభించాయి! కొందరు చీకటి కొట్లలో తోయబడ్డారు. లాఠీలు రక్తాలు తాగాయి, భాష్ప వాయువు ప్రజల కన్నీటిని వర్షంలా కురిపించింది. ప్రజల చేతుల్లో రాళ్ళు ఆయుధాలుగా మారాయి సోడాబుడ్లు చేతిబాంబుల్లా పనిచేశాయి. ప్రభుత్వ ఆస్తి దగ్ధం చేయబడింది. ప్రజలు పెచ్చరిల్లిపోయారు. సాయుధ దళాలు వుగ్రరూపం దాల్చాయి. ఎందరో ప్రజలుకాల్చబడ్డారు. మరెందరెందరో గాయపడ్డారు. ఆ ప్రాంతం దాదాపు యుద్ధభూమిగా మారిపోయింది.

ఆ భూమి యువకుల రక్తం తాగి దాహం తీర్చుకుంది.

ఆ విధంగా అప్పుడు ఎంతో హింస జరిగింది. ఎంతో రక్తం పారింది.

♦ ♦ ♦

మరోసారి.........

"ఓ రాగరోరి దద్దా, ఆగరా! కుపింతాగు, జోరీగ నాగలాగీ ఎట్టుకుపోతున్నావేటి? నా ఒగిసు నీకు తెల్దేమో, నువ్వు సెప్పిందంతా నా కెరికే, నా నోటడుగుతా సెప్పు మా మోల్లం? సెవట సిందుకు బతికేహోల్లం. ఒల్లుగుల్ల సేసుకు బతుకుతున్నాం. అపునుగందా? అయినా మాకు పొట్టగడవటంనేదే! ఆకల్తో సావనేక డబ్బునోళ్ళకాడ కూలీ నాలీ సేసుకుంటూ కుక్కల్లా, పందుల్లా బతుకుతున్నావే! మా పుటక డబ్బునోళ్ళకి సాకిరీ సేయడానికేనా? మా శ్రమ డబ్బునోళ్ళ డబ్బుకి పురుల్లోయడానికేనా? సెప్పు నువ్వు- మా కట్టం మాకు కూడూ - బట్టా ఎట్టటం నేదే! మాయి దయిద్రం బతుకు లేనె! మాకంతా అన్నెయమే జరుగుతోందిగందా? మా కన్నెయం జరుగుతోందనీ ఈరందరికీ ఎరికే నే! సెపు నువు సెప్పు - మరీ రోరూ మా కోసం - మా కన్నెయం జరక్కుండా — నేయం కోసం ఎందుకు పోట్టాడ్రు? సెప్పవయ్యా. సెప్పు, అది గదలా గుంచు. మరి నువు సెపినావే. ఈ సినసినోళ్ళటికే రకతం ఈదులంట పారుతోంది గందా — మాకు జరుగుతున్న అన్నేయం అలబొద్దుదీ మాపిల్లీగాదే - మంత్రిసెట్టు నాగ ఏట్నా, ఊట్నా, దించి రావ్వసినాగ ఎదిగిపోనాదే— మరా అన్నేయం— రకతం కళ్ళు జూడకుండా రకతం వొరదల్లై పారకుండా పోద్దేటి?సెప్పైపో, సెప్పు"అనిఅతడు పళ్ళు పటపటా కొరుకుతూ, చేతిలోని కర్రతో నేల్ని బాదుతూ, నా జవాబుకోసం యెదురుచూడకుండా వెళ్ళిపోయాడు. ●

